ఈనాడు
వరంగల్
గురువారం అక్టోబరు 10, 2024
13

పూలకు భలే గిరాకీ!



కొనుగోలు చేస్తున్న మహిళలు



ఆర్ఎన్‌టీరోడ్డులో రద్దీ

జిల్లాలో గురువారం సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా.. నగరంలో బుధవారం మార్కెట్ సముదాయాలు జనాలతో కిక్కిరిశాయి. ప్రధాన కూడళ్లు, వాణిజ్య దుకాణాలు, షాపింగ్‌మాల్స్‌లతో పాటు పూల దుకాణాలన్నీ కిటకిటలాడాయి. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి పూలను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. బంతి, చామంతి, రోజా పూల విక్రయాలు పెద్ద మొత్తంలో జరుగుతాయి. సద్దుల బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా.. బుధవారం ఉదయం నుంచే పూల మార్కెట్‌కు జనాలు తరలివచ్చారు. దీంతో ఒక్కసారిగా పూల ధరలకు రెక్కలొచ్చాయి. గతవారం వరకు కిలో బంతి రూ.50 ఉండగా.. బుధవారం ఒక్కసారిగా రూ.150 నుంచి రూ.200కు పెరగడంతో.. కొనుగోలుదారులు నివ్వెరపోయారు. భారీ వర్షాల వల్ల పూల దిగుమతి తగ్గడంతో.. ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, గిర్మాజీపేట, మట్టెవాడ

జగమేలుతోంది.. మన బతుకమ్మ

'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..
ఏమేమి కాయప్పునే గౌరమ్మ..
చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ..
ఒక్కోసి పువ్వేసి సందమామ.. బతుకమ్మ బతుకమ్మ
ఉయ్యాలో.. మమ్మేలు కోవమ్మ ఉయ్యాలో..
అంటూ ఓరుగల్లువ్యాప్తంగా బతుకమ్మ పాటలు మారుమోగుతున్నాయి..

నేడు సద్దుల బతుకమ్మ

ఎన్నో ప్రత్యేకతలు.. సంప్రదాయాల మేళవింపు

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి, న్యూస్‌టుడే, నర్సంపేట, దేవరుప్పుల(జనగామ)

ఇంద్రధనస్సులోని వర్ణాలు కలగలిసిన తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మ నేడు జగమేలుతోంది.. తెలంగాణ సంస్కృతికి పూల పండగ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.. మన సంప్రదాయాన్ని విదేశాల్లోనూ వ్యాప్తి చేస్తున్నారు.అక్కడ స్థిరపడ్డ మనవాళ్లు అంగరంగ వైభవంగా జరుపుకొంటున్నారు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ పండగను నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..



16 ఏళ్లుగా ఒక్కో అడుగు పెంచుతూ..



నర్సంపేటకు చెందిన రుద్రారపు సరోజన-షైడయ్య దంపతులు తొమ్మిది రకాల పూలతో ఏటా ఒక అడుగు పెంచుతూ పెద్ద బతుకమ్మను పేరుస్తున్నారు. 16 ఏళ్ల కిందట తొలిసారి 3 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చారు. అప్పటి నుంచి ఏటా ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ వస్తున్నారు. ఈసారి 12 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజులుగా పలువురు కూలీలతో పెట్టి కొత్తగూడ, గంగారం, పాకాల అడవుల్లో గునుగు, తంగేడు, టేకు, అల్లీ పూలు, తామర, సీతజడ, బంతి, చామంతి వంటి 9 రకాల పూలను సేకరిస్తున్నారు. ఇంట్లో మహిళా కూలీలతో వాటిని కట్టలు కట్టిస్తున్నారు. ప్రత్యేకం ట్రాలీలో బతుకమ్మను మైదానానికి భాజాభజంత్రీల నడుమ తీసుకొస్తారు.

కర్ణాటకవాసులకు మక్కువ..



బతుకమ్మ పండగను కన్నడ ప్రజలు బాగా ఇష్టపడుతున్నారు. కర్ణాటకలోని హసన్ జిల్లా హళిబిడ గ్రామానికి చెందిన అయ్యగార్ యమునా-రాజు దంపతులు పదేళ్ల కిందట నర్సంపేటకు వచ్చి బేకరీ నడుపుతున్నారు. ఇక్కడి ప్రజలు పూలను ఆరాధించే సంస్కృతి వారికి బాగా నచ్చింది. సొంతంగా బతుకమ్మ పేర్చి ఇక్కడి మహిళలతో కలిసి ఆడుతున్నారు.

సీతంపేటలో దీపావళికి వేడుకలు.. పురుషులూ ఆడుతారు..



భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం సీతంపేటలో నేతకాని కులస్థులు దీపావళి పండగ సమయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. గ్రామస్థులు తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగిస్తున్నారు. దీపావళి రోజున పుట్టమన్ను తీసుకొచ్చి ఇళ్లలో జోడెడ్ల ప్రతిమలను తయారు చేసి పూజిస్తారు. మరుసటి రోజున కేధారేశ్వర వ్రతం చేస్తారు. జోడెడ్లను అలంకరించి ఊరేగిస్తారు. తర్వాత చెరువులో నిమజ్జనం చేస్తారు. మరుసటి రోజున సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. మహిళలతో పాటు, పురుషులు కూడా బతుకమ్మ ఆడుతారు.

విదేశాల్లోనూ సందడే..

ఒకప్పుడు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోనే సందడి చేసిన బతుకమ్మ పండగ నేడు విశ్వవ్యాప్తమైంది. యూకేలోని వారిక్ పట్టణంలో జరిగే వేడుకలు ఉత్తరాది దక్షిణాది సంస్కృతుల మేళవింపుగా సాగుతున్నాయని తెలుగు ఆడపడుచు, అక్కడి కౌన్సిలర్ ఎల్లాప్రగడ హేమ తెలిపారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం విదేశీ మహిళలు ఆసక్తిగా గమనించి.. తమతో కలిసి వస్తున్నారని తెలుగు మహిళలు చెబుతున్నారు.



టోక్యో నగరంలో..

ముందస్తు అనుమతి తీసుకుంటాం..



- తాటిపాటి పల్లవీ-సాగర్, కోటోకు ఓజీమా వీధి, టోక్యో (దేవరుప్పుల మండలం సీతారాంపురం)

మా వీధిలో 60 వరకు తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మ పండగను అందరం కలిసి జరుపుకొంటాం. సామూహికంగా నిర్వహించాలి కాబట్టి అధికారుల ముందస్తు అనుమతి తీసుకుంటాం. గడ్డిపూలు, వివిధ రాకల పూలతో బతుకమ్మ పేర్చి, ఒక దగ్గర గుమిగూడి ఆటపాటలతో సందడి చేసి, వాయినాలు ఇచ్చుకుంటాం. సమీపంలోని నదిలో నిమజ్జనం చేస్తాం.

వంటకాలను ఇచ్చిపుచ్చుకుంటాం..



- పెద్దాపురం మమత, అల్బనీ, అమెరికా, (దేవరుప్పుల)

అల్బనీ ప్రాంతంలో బతుకమ్మకు ప్రత్యేకంగా పూలు తెచ్చి మార్కెట్‌లో అమ్ముతుంటారు. ఇక్కడ తెలుగు సహా ఇతర రాష్ట్రాల మహిళలు కలిసి వేడుకలు జరుపుకొంటారు. సద్దుల బతుకమ్మ నాడు వండిన వంటకాలను ఒకరికొకరం పంచుకుంటాం.

ఇంట్లోనే నిమజ్జనం..

- గాదె ఉషశ్రీ, చెక్ రిపబ్లిక్, (దేవరుప్పుల)



మేము ఉండే దగ్గర 25-30 తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మను ఎవరి నివాసంలో వారే నిర్వహించి, అష్టమి రోజు ఒక నీటి తొట్టి ఏర్పాటు చేసుకొని నిమజ్జనం చేస్తాం. వీలును బట్టి అందరి ఇళ్లు కలియతిరిగి శుభాకాంక్షలు చెప్పుకొంటాం.

● కెనడా రాజధాని అటవా నగరంలో వరంగల్ జిల్లాకు చెందిన పలు అనేక కుటుంబాలు స్థిరపడ్డాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి మండలం దండేపల్లికి చెందిన సుధీర్ కోదాటి ఈ ప్రాంతంలోని తెలుగువారిని సంఘటితం చేసి గత 15 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. తెలుగు అసోసియేషన్ నిర్వహించే బతుకమ్మ వేడుకలకు బంగారు నాణేలు, 500 డాలర్లు బహుమతులుగా ఇస్తున్నారు. 19 ఏళ్ల కింద అమెరికాలోని షికాగాలో స్థిరపడిన వర్ధన్నపేటకు చెందిన పూర్ణచందర్ అల్లమనేని 2003 నుంచి ఘనంగా సంబరాలు జరుపుతున్నారు.

పరీక్షించి.. నాణ్యత వివరించి..!

'ఈనాడు' కథనంతో కదిలిన ఇంజినీర్లు



వరంగల్ రంగంపేటలోని ఓ ఇంట్లో నీటి పరీక్షలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నల్లా నీళ్లను తాగేందుకు నగర ప్రజలు సాహసించడం లేదు. రంగుమారిన తాగునీటి సరఫరాతో బల్దియాకు ఫిర్యాదులు పెరిగాయి. మురుగు మరక తొలగించడం, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నామని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రేటర్ వరంగల్ ఇంజినీర్లు క్షేత్రస్థాయికి కదిలారు. ఈ నెల 8న ఈనాడులో 'పండగ పూట.. తాగునీటి గోస' శీర్షికన ప్రచురితమైన కథనంతో రెండు రోజులుగా వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పది ప్రత్యేక బృందాలు ఇంటింటా తాగునీటి పరీక్షలు చేస్తున్నారు. హనుమకొండ ప్రాంతం నయీంనగర్, కొత్తూరుజెండా, కుమార్‌పల్లి, బాలసముద్రం, కాజీపేట బాపూజీనగర్, సిద్ధార్థనగర్, వరంగల్ ప్రాంతంలో రంగంపేట, సరస్వతీనగర్, కొత్తవాడ, ఎల్బీనగర్, ఓ సిటీ, చింతల్, రామన్నపేట కాలనీల్లో ఇంటింటికెళ్లి కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు పరిశీలించారు. క్లోరినేషన్ ఎంత శాతం ఉందో పరీక్షలు చేశారు. కుళాయి నీళ్లను తాగాలని ప్రజలకు సూచించారు.

రోజూ సరఫరా చేయాలి

పండగలు ఉన్నందున తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఇంజినీర్లను మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. హనుమకొండ కేయూసీ, వరంగల్ దేశాయిపేట, అండర్ రైల్వేగేటు జోన్ల పరిధిలో నీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. రోజూ తాగునీటి సరఫరా జరగాలని సూచించారు. ఈనాడులో ప్రచురితమైన కథనాన్ని కొందరు సామాజిక కార్యకర్తలు రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ. గౌతమ్‌కు పంపించారు.

పత్తి కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు



మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. దసరా పండగ తర్వాత తొలి విడతలో 15 మిల్లులను గుర్తించి కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 1.20 లక్షల విస్తీర్ణంలో సాగుచేయగా.. 96,030 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పత్తిలో 20 శాతం తేమ ఉన్నప్పటికీ మద్దతు ధర చెల్లించాలని రైతు సంఘాల నాయకులు కోరారు. అదనపు పాలనాధికారి సంధ్యారాణి, సీసీఐ డిప్యూటీ జీఎం అర్జున్ దవే, డీఏవో అనురాధ, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శులు, రైతు సంఘాలు, పత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు వేర్వేరు కౌంటర్లు

వరంగల్ కలెక్టరేట్: సన్నరకం, దొడ్డు రకం వడ్లను సేకరించేందుకు కొనుగోలు కేంద్రాల్లో వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. సన్నధాన్యం నిర్ధారణపై వ్యవసాయశాఖ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో బుధవారం కలెక్టరేట్‌లో ఏవోలు, ఏఈవోలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

జిల్లా ప్రజలకు సద్దుల శుభాకాంక్షలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద కోరారు. గురువారం సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా సంక్షేమాధికారిగా రాజమణి

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా సంక్షేమశాఖ అధికారిగా బి.రాజమణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పాలనాధికారి డా.సత్యశారదను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీడీపీవోలకు సహాయ సంచాలకులుగా పదోన్నతి కల్పిస్తూ.. మహిళాశిశు సంక్షేమశాఖ కార్యదర్శి గతనెల 15న ఉత్తర్వులు జారీ చేయగా.. హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారిగా పనిచేస్తున్న బి.రాజమణిని వరంగల్ జిల్లాకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జె.హైమావతిని మెదక్ జిల్లా సంక్షేమాధికారిగా బదిలీ అయ్యారు. అయినా ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేసి.. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది సంక్షేమాధికారులు తమకు కేటాయించిన జిల్లాల్లో విధుల్లో చేరలేదు. అందులో వరంగల్, హనుమకొండ సంక్షేమాధికారులు ఉన్నారు. తమకు నచ్చిన జిల్లాలో పోస్టింగు కోసం వారు ప్రయత్నించారు. కేటాయించిన చోటే విధుల్లో చేరాలని మంగళవారం మరోసారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదని నిరసన




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు బుధవారం హనుమకొండ అంబేడ్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నల్లజెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటో తేదీన ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పునకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కట్ల రాజశేఖర్, కళ్లెపెల్లి ప్రణయ్‌దీప్, బిర్రు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుల సంబరం

ఉద్యోగ సాధనలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నారు. కల సాకారమైన వేళ తమ కష్టాన్ని మరిచిపోయారు. ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు సాధించి పండగ వేళ నియామక పత్రాలు అందుకున్నారు. తమ కుటుంబాల్లో వెలుగులు నింపారు.



హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా నియామకం అందుకుంటున్న జిల్లాకు చెందిన ఏకాంబ్రం, చిమాని కల్పన

తండ్రి బాటలో తనయుడు



పవన్‌కుమార్

ఖానాపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తిలో తండ్రికి తగిన తనయులు అనిపించుకున్నారు. పట్టుదలతో ఒకరు ప్రభుత్వ ఉద్యోగం పొందారు. వేపచెట్టుతండాకు చెందిన రాములు ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. అదే బాటలో ఇద్దరూ కొడుకులు ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్నారు. తాజా చిన్న కొడుకు పవన్‌కుమార్ తొలి ప్రయత్నంలోనే ఎస్జీటీ ఉద్యోగం సాధించాడు. పెద్ద కుమారుడు హరిప్రసాద్ గణిత సీఆర్టీగా(కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్) నర్మెట్టలో పని చేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయ వృత్తిపై తమకు ఇష్టమని రాములు పేర్కొన్నాడు.

ఒకే కుటుంబంలో మూడు ఉద్యోగాలు



రాయపర్తి, న్యూస్‌టుడే: వ్యవసాయ ఆధారిత కుటుంబంలో పుట్టి.. కష్టాలను ఎదుర్కొని.. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మండలంలోని జగన్నాథపల్లి శివారు కొత్తతండాకు చెందిన బోడ గణేష్, సురేష్ అన్నదమ్ములు, వారి చిన్నాన్న కుమారుడు నరేందర్. వ్యవసాయ పనులు చేసుకుంటూనే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. కష్టపడి చదివి ముగ్గురు డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువులు సాధించి.. ఆదర్శంగా నిలిచారు.

భర్త స్ఫూర్తితో..



నర్సంపేట గ్రామీణం: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న భర్తను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగం సాధించారు గురిజాలకు చెందిన తాళ్లపల్లి సమత. ఐనవోలు మండలం పంథనికి చెందిన సమతకు గురిజాలకు చెందిన తాళ్లపల్లి రమేశ్‌తో 2008లో వివాహమైంది. రమేశ్ 2006 లో డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం కేసముద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. సమత 2011లో డీఈడీ, 2014 లో బీఈడీ చేశారు. ఇంటికి.. చదువుకు ప్రాధాన్యమిస్తూ 15ఏళ్ల సర్కారు కొలువు కలను సాకారం చేశారు. సమతకు 69.23 మార్కులతో 14వ ర్యాంకు పొందారు. నియామకపత్రం అందుకోవడం సంతోషంగా ఉందని వారు 'న్యూస్‌టుడే' కు తెలిపారు.

పేద కుటుంబం..



నర్సంపేట గ్రామీణం: గురిజాలకు చెందిన మాడిశెట్టి శ్రీనివాస్, సుజాత దంపతుల రెండో కూతురు మాధవి డీఎస్సీ(ఎస్జీటీ)లో 68 మార్కులతో 64 వ ర్యాంకు సాధించారు. శ్రీనివాస్ గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తూ ఇద్దరు పిల్లలను చదివించారు. మధ్య తరగతి కుటుంబం.. తల్లిదండ్రుల కష్టాన్ని చూసి మాధవి ప్రభుత్వ కొలువు సాధించారు. వారి కుటుంబంలో తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో మాధవి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్రమశిక్షణతో చదివి...



చెన్నారావుపేట: మండలంలోని జల్లికి చెందిన ముత్యాల సారయ్య-సరోజ దంపతుల కుమారుడు సురేష్ డీఎస్సీలో ప్రతిభ కనబర్చారు. తల్లిదండ్రులు వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ చదివించారు. వారి కష్టానికి ప్రతిఫలంగా స్కూల్ అసిస్టెంట్ గణితం విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించి ఉద్యోగం పొందాడు. బుధవారం హైదరాబాద్‌లో అధికారుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. సురేష్ మొదట పంచాయతీ కార్యదర్శి ఉద్యోగానికి, తర్వాత గురుకుల ఉపాధ్యాయుడిగా, తాజాగా స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయుడి ఉద్యోగం సాధించారు.

> ప్రస్తుతం మడికొండలోని మెట్టుగుట్ట సీతారామాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన 240 ఎకరాల దేవాదాయశాఖ భూములు ఉన్నాయి. ఇందులో 160 ఎకరాలు రైల్వేకు ఇచ్చారు. మిగిలిన స్థలం కూడా కోచ్‌ల నిర్మాణానికి కేంద్రం సేకరించే అవకాశాలున్నాయి.

వందేభారత్ తయారీ ఇక్కడే!

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కల సాకారం..
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటనతో ఆనందం
- అదనంగా రూ.66 కోట్లు మంజూరు




కాజీపేట, న్యూస్‌టుడే

ఓరుగల్లు ప్రజల చిరకాల వాంఛ నెరవేరే రోజు వచ్చింది. గత 45 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో కాజీపేటలో కోచ్‌లు తయారు చేస్తామని ప్రకటించడం ఆశలు రేపాయి. రైల్వే జంక్షన్ కాజీపేటలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న వ్యాగన్ తయారీ కేంద్రాన్నే అప్‌గ్రేడ్ చేసి కోచ్‌లు తయారు చేయాలని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉన్న వందే భారత్ రైలు కోచ్‌లు ఇక్కడ తయారు చేయాలని నిర్ణయించడం కాజీపేటకు గొప్ప మలుపు కాబోతోంది.

ఒక్కో అడుగు పడుతూ..

వరంగల్ ప్రజల నాలుగు దశాబ్దాల ఉద్యమ ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ. 1980 దశకంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం సైతం మంజూరు చేసింది. డీజిల్ షెడ్ పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. పంజాబ్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ పరిశ్రమలు నెలకొల్పే యోచనను అటకెక్కించి ఆలోచనతో కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని కపుర్తలకు మార్చారు. అప్పటి నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. 2010లో వ్యాగన్ మరమ్మతుల వర్క్‌షాప్, వ్యాగన్ తయారీ కేంద్రాన్ని సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అక్కడ స్థలం లేకపోవడంతో కాజీపేటకు తరలించింది. ఇక్కడా స్థల సేకరణలో ఆలస్యమైంది. చివరికి 2016లో వ్యాగన్ షెడ్ కోసం నిధులు కేటాయించారు. ఎట్టకేలకు 2023లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ పనులను ప్రారంభించారు. స్థానికులు దీనిపై అసంతృప్తిగా ఉండటంతో వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్‌తో పాటు పీరియాడికల్ ఓవరాలింగ్ కేంద్రాన్ని సైతం మంజూరు చేశారు. కోచ్ మీద ఉన్న ఆశ అలాగే ఉంది. స్థానిక రైల్వే ఐకాస ఆధ్వర్యంలో కోచ్ సాధన సమితి పేరు మీద ఆందోళన చేశారు. చివరకు దేశవ్యాప్తంగా వందేభారత్ రైలు కోచ్‌లకు డిమాండ్ ఉండటంతో వ్యాగన్ తయారీ పరిశ్రమను, పీఓహెచ్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అభివృద్ధి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.



నిర్మాణంలో భారీ షెడ్



సిద్ధంగా క్రేన్లు

అడ్డంకులు లేకుండా ఉన్న స్థలంలోనే..

కోచ్ ఫ్యాక్టరీకి మరింత స్థలం అవసరం. సేకరణకు సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నుంచి 160 ఎకరాలను సేకరించి వ్యాగన్ పరిశ్రమను నెలకొల్పుతున్నారు. రెండు ప్రధాన షెడ్ల నిర్మాణం, కార్యాలయ భవనాలు నిర్మిస్తున్నారు. దీనికి అదనంగా మరో షెడ్డును నిర్మించడానికి రూ.66 కోట్లను కేంద్రం విడుదల చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 160 ఎకరాల్లోనే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న స్థలాన్ని పూర్తి సామర్థ్యం మేరకు వినియోగించుకోవాలని చూస్తున్నారు. రాబోయే రోజుల్లో అదనపు స్థలం సేకరించి మరింత విస్తరిస్తారు.

చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో

చెన్నై పెరంబూరులో గల ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో ఇక్కడ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ వందే భారత్ కోచ్‌లు తయారవుతున్నాయి. దీనికి అదనంగా ఇప్పుడు కాజీపేటలో ప్రారంభం అవుతాయి.

3000 మంది సిబ్బంది..

కోచ్ ఫ్యాక్టరీకి 3000 మంది సిబ్బంది అవసరం రానున్నారు. పీఓహెచ్, వ్యాగన్ పరిశ్రమలకు 2000 మంది అవసరం అవుతారు. రెండు పరిశ్రమలకు కలిపి మొత్తం 5000 మంది కార్మికులు వచ్చే అవకాశం ఉంది. ముందుగా వందేభారత్ రైళ్ల కోచ్‌ల తయారీపైనే దృష్టి పెడుతున్నారు. షెడ్ నిర్మాణం కాగానే తయారీ యంత్రాలను అమరుస్తారు. పెరంబూరు కోచ్ ఫ్యాక్టరీలో పనిచేసే నిపుణులను రప్పించి ఇక్కడి కార్మికులు, అధికారులకు శిక్షణ ఇస్తారు. కోచ్‌ఫ్యాక్టరీ పూర్తి స్థాయిలో పనిచేస్తే రాంపూర్, కాజీపేట ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. అనుబంధ పరిశ్రమలు వస్తాయి.



రైల్వే వ్యాగన్‌ల తయారీ కేంద్రం షెడ్



వ్యాగన్ పరిశ్రమ కార్యాలయం

అంకెల్లో వివరాలు..

- కోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ గతిశక్తి పథకం కింద ఏర్పాటు చేస్తోంది.
- వ్యాగన్ షెడ్ కాజీపేటలో ప్రతిపాదించిన సంవత్సరం- 2013
- కేటాయించిన నిధులు రూ.521 కోట్లు
- మొదటి దశలో విడుదలైనవి రూ.220 కోట్లు
- వ్యాగన్ తయారీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది: 2023
- పీఓహెచ్‌గా అప్‌గ్రేడ్ అయింది: 2023
- కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యేది: 2025-26

పడిలేచిన కెరటం..



ఒకప్పుడు ఇంటి ముందు పోస్ట్.. అన్నమాట వినపడగానే ఇంట్లో అందరి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసేది. దూరాన ఉన్న బంధువుల యోగక్షేమాలను అది మోసుకొచ్చేది. మన క్షేమ సమాచారం తీసుకెళ్లేది. ఇంటింటిని పలకరించే ఆత్మీయ బంధువులా తపాలాశాఖ ఉండేది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం పెరిగి అంతర్జాలం, చరవాణులు అందుబాటులోకి వచ్చాక ఉత్తర ప్రత్యుత్తరాలు కనుమరుగయ్యాయి. మనియార్డర్లు పంపేవారు లేరు. తపాలాశాఖ ప్రాభవం కోల్పోయే పరిస్థితి నుంచి మళ్లీ కోలుకుంది. వినూత్న సేవలతో ప్రజాదరణ పొందుతోంది. గురువారం జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. – న్యూస్‌టుడే, శివనగర్

గ్రామస్థాయిలో పటిష్ఠ సమాచార, మానవ వనరులతో కూడిన వ్యవస్థ ఒక్క తపాలాశాఖకే సొంతం. వర్షం కురిసినా.. వరదలు పొంగినా తోకలేని పిట్ట తొంభై మైళ్లు వెళ్తుంది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థ తోడుతో తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. సేవలను అందించడంలో వేగం పెరిగింది. సాధారణ సేవలతో పాటు పొదుపు, బీమా, బ్యాంకింగ్ రంగంలోనూ అడుగిడింది.

అందిస్తున్న సేవలు..

సాధారణ తపాలా సేవలతో పాటు స్పీడ్‌పోస్టు, క్యాష్ ఆన్ డెలివరి (సీవోడీ), ఎలక్ట్రానిక్ మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ అప్‌డేట్ (సవరణ), తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనం టికెట్లు, మైస్టాంప్, వెస్టర్న్ మనీ ట్రాన్స్‌ఫర్. ● పొదుపు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లు, కిసాన్ వికాస పత్రాలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్, సుకన్య సమృద్ధి యోజన ఖాతా, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్, నెలవారీ ఆదాయ పథకం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు, 1 నుంచి 5 ఏళ్ల టైమ్ డిపాజిట్ ఖాతాలు, తపాలా బ్యాంకు, ఏటీఎం.



వరంగల్ డివిజన్‌లో తపాలా ఖాతాదారులు

- పొదుపు 644575
- సాధారణ 188042
- టైమ్ డిపాజిట్ (టీడీ) 11849
- రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) 320274
- పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీఎఫ్) 1198
- నెలవారీ ఆదాయ పథకం (ఎంఐఎస్) 3248
- తపాలా జీవిత బీమా 5108
- గ్రామీణ తపాలా జీవిత బీమా 9816
- సుకన్య సమృద్ధి యోజన 49843
- ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన 43303
- అటల్ పెన్షన్ యోజన 1565
- పోస్టల్ బ్యాంకు ఏటీఎంలు 10,226
- ఆసరా పింఛన్ల పంపిణీ 177103

తపాలా సేవలు ఆదర్శం

మీసేవ తరహాలో..

విమాన, బస్సు, రైలు టికెట్ల రిజర్వేషన్, అన్ని రకాల బీమా పథకాలు, ఇంటి, నల్లా పన్నులు, గ్యాస్ బిల్లులు, ఈఎంఐ చెల్లింపులు, ఫాస్టాగ్, ఐటీ రిటర్న్స్, సెల్‌ఫోన్ సిమ్‌కార్డు రిఛార్జి, పాన్‌కార్డు, పాస్‌పోర్టుకు దరఖాస్తులు, పీఎం ఫసల్ బీమా, పీఎం జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి శ్రమయోగి మన్‌ధన్ యోజన (పీఎం-ఎస్‌వైఎం), ప్రధాన మంత్రి లఘు వ్యాపారి మన్-ధన్ యోజన (పీఎం-ఎల్‌వీఎం), ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వనిధి), నేషనల్ పెన్షన్ సిస్టం, జీవన్ ప్రమాణ్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) జారీకి దరఖాస్తు, ఇ-డిస్ట్రిక్ట్ సేవలు.



వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయంలో సేవలందుకుంటున్న వినియోగదారులు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఇలా.. వరంగల్, హనుమకొండ డివిజన్ల పరిధిలో ఐదు ప్రధాన, 90 సబ్ యూనిట్, గ్రామస్థాయిలో 679 తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయి.

లేఖల్లోనే మాట్లాడుకునేవాళ్లం..



- రామ్మూర్తి, విశ్రాంత జైలర్, శివనగర్ (వరంగల్)

నేను 1985 నుంచి తొమ్మిదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా (ప్రస్తుతం వైఎస్ఆర్ జిల్లా) ప్రొద్దుటూరు సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేశాను. నా భార్య సత్యవతి వరంగల్‌లో ఉండేది. ఆమెకు నాలుగు రోజులకు ఒక లేఖ రాసేవాడిని. ఆమె యోగక్షేమాలు, పిల్లలు ఎలా చదువుతున్నారు, వారి ఆరోగ్యం ఎలా ఉందంటూ.. ఉత్తరాల ద్వారా అడిగేవాన్ని. ఆమె రాసిన ఉత్తరం చదువుతుంటే ఆమె మాట్లాడుతున్నట్లే అనుభూతి పొందేవాడిని. టెలికాం రంగం ఎంత అభివృద్ధి చెందినా భావవ్యక్తీకరణ, మనసును కదిలించడం ఉత్తరానికే దక్కుతుంది..

పథకాలపై విస్తృత ప్రచారం



తపాలా పథకాలు, సేవలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రధాన గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) సేవలను ఎక్కువగా ఉపయోగించుకునేలా డిజిటల్ సేవలను విస్తృతం చేశాం.

- రవికుమార్, సూపరింటెండెంట్, వరంగల్

చదువుల తల్లిగా భద్రకాళి!



రంగంపేట(వరంగల్), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం వరంగల్ జిల్లాలోని భద్రకాళి అమ్మవారు సరస్వతీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. లలిత పంచమి పర్వదినం కావడంతో అమ్మ సన్నిధిలో పిల్లలతో అక్షరాలు దిద్దించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి రథసేవ నిర్వహించారు. శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. చదువుల తల్లిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

● 'మహాష్టమి(దుర్గాష్టమి) రోజున కోటి యోగిని గణములతో శ్రీభద్రకాళి అమ్మవారి జన్మించారు. అందుకే మహాష్టమి పర్వదినాన సద్దుల బతుకమ్మ ఆడతారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని' ఈవో శేషుభారతి తెలిపారు.

పీహెచ్‌డీ ప్రవేశాలపై సద్దుమణగని ఆందోళన



రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారును అడ్డుకుంటున్న విద్యార్థులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం విద్యార్థులు చేస్తున్న ఆందోళన సద్దుమణగడం లేదు. బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టిన విద్యార్థులు పీహెచ్‌డీ- 2022 కేటగిరి-2 రెండో జాబితాలో ప్రవేశాలు కల్పించాలని రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారుకు అడ్డంగా బైఠాయించారు. తమకు ప్రవేశాలు కల్పించే వరకు వెళ్లనిచ్చేది లేదని భీష్మించడంతో కేయూ ఠాణా ఎస్ఐ రాజ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి వారిని నిలువరించారు. విషయాన్ని ఇన్‌ఛార్జి ఉప కులపతి వాకాటి కరుణకు వివరించి, న్యాయం జరిగేలా చూస్తానని రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మంద నరేష్, రాకేష్, మనోహర్, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

దేశాలు దాటి వెళ్లి.. మృతదేహమై తిరిగొచ్చి!



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఉగాండాలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్న జనగామకు చెందిన ఇటికాల తిరుమలేశ్ తాను పని చేసే కంపెనీలోనే సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉగాండా నుంచి ఐదు రోజులకు బుధవారం తిరుమలేశ్ మృతదేహం జనగామ పట్టణం గిర్నిగడ్డలోని స్వగృహానికి మధ్యాహ్నం 1 గంటకు చేరుకుంది. తిరుమలేశ్ మృతదేహంతో పాటు ఆయన భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండా నుంచి వచ్చారు. జనగామలో ఉన్న మృతుడి తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నా, చెల్లెలు హేమలతతో పాటు కుమార్తె అఖిల ఐదు రోజులుగా మృతదేహం కోసం నిరీక్షిస్తూ కన్నీటి పర్యంతంలో మునిగిపోయారు. 'దేశం కాని దేశం వెళ్లి... శవంగా వచ్చావా.. బిడ్డా.. నీ భార్య పిల్లలను ఆగం చేసితివా బిడ్డా..' అంటూ తల్లి కిష్టమ్మ విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ ప్రజలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమలేశ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పిల్లల చదువుకు అవసరమైతే బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చి, ఆర్థిక సాయం అందజేశారు. అంత్యక్రియలు పట్టణంలోని మార్కెట్ సమీప శ్మశాన వాటికలో సాయంత్రం 6గంటలకు ముగిసాయి.

నిరుపేద కుటుంబంపై దీర్ఘకాలిక జబ్బు పంజా

● గంటల వ్యవధిలో తల్లీకుమారుడు మృతి



తల్లి చిదురాల శోభతో సాయికిరణ్

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: వారికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం. భార్య, భర్త, ఇద్దరు కుమారులు రోజూ పనిచేసుకొని జీవించేవారు. దీర్ఘకాలిక జబ్బు బారినపడిన తల్లి, కుమారుడు ఒకేరోజు గంటల వ్యవధిలో మృతి చెందారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామానికి చెందిన చిదురాల లక్ష్మణ్ తాపీమేస్త్రీగా, భార్య శోభ (53) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. శోభకు రెండేళ్ల కిందట బోన్ టీబీ సోకగా.. గ్రామంలోనే మోటార్ మెకానిక్ పని చేస్తున్న చిన్న కుమారుడు సాయికిరణ్ (25) ఏడాది కిందట నోటి క్యాన్సర్‌కు గురయ్యాడు. ఉన్నంతలో ఆసుపత్రులకు తిరిగి ఖర్చు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. మంచానికే పరిమితమైన తల్లి బుధవారం ఉదయం మృతి చెందగా.. రెండు గంటల వ్యవధిలో కుమారుడు సైతం కన్నుమూశాడు. బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఒకే ఇంట్లో ఇద్దరి మృతి ఆ కుటుంబం, గ్రామంలో విషాదం నింపింది. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులే విరాళాలు వేసుకొని ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

పండగ వచ్చిందంటే ట్రా'ఫికర్'


పూల మార్కెట్‌లో భారీగా వాహనాలు

ఏ పండగొచ్చినా.. తపాలా కార్యాలయం వీధిలో ట్రాఫిక్ జామ్ అవ్వాల్సిందే. పూలు, ఇతర వస్తువులు విక్రయించే వ్యాపారులు రోడ్డును ఆక్రమించడంతో.. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఆ వైపు వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. కొనుగోలుదారులు వాహనాలపై నిలబడే.. క్రయవిక్రయాలు జరుపుతుంటారు. బుధవారం పూలు కొనుగోలు చేసేందుకు వచ్చిన జనంతో చాలా సమయం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీసులు ఇటు వ్యాపారులను, వాహనదారులను నియంత్రించేందుకు ప్రయత్నించినా.. ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. 102 వాహనం కొంతసేపు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. – న్యూస్‌టుడే, గిర్మాజీపేట


ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో..


వరంగల్ రంగంపేటలోని ధార్మిక భవన్‌లో..

బతుకమ్మ సంబరాలు


దుగ్గొండి పీహెచ్‌సీలో

జిల్లాలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. రంగంపేటలోని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ వరంగల్ జోన్ శాఖ కార్యాలయం(ధార్మిక భవన్)లో బుధవారం సాయంత్రం మహిళ ఉద్యోగినులు బతుకమ్మ ఆట, పాటలతో సందడి చేశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో బుధవారం పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు బతకమ్మ వేడుకలను నిర్వహించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా దంపతులతో పాటు పలువురు పాల్గొని ఆడారు. బతుకమ్మను అందంగా తీర్చిదిద్దిన వారికి సీపీ బహుమతి అందించారు. నర్సంపేట నియోజకవర్గంలోనూ వేడుకలు కొనసాగాయి. – న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం


నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో


కమిషనరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలతో సీపీ


ఎంజీఎం కూడలిలో శ్రీరాజరాజేశ్వరి దేవి


శివనగర్ సీతారామాలయంలో..


పిన్నవారివీధిలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో..


నర్సంపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


వరంగల్ శంకర మఠంలో..

ప్రత్యేక పూజలు.. అక్షరాభ్యాసాలు

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా శారదా దేవిని సరస్వతి మాతగా అలంకరించారు. సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. విద్యార్థులకు సరస్వతి కంకణాలు అందజేశారు. గిర్మాజీపేటలో మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్లమ్మ దేవాలయానికి భక్తులు సమర్పించిన సుమారు 1000 చీరలను మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో పేదలకు పంపిణీ చేశారు. నగర సీపీ అంబర్ కిశోర్ ఝా వివిధ ప్రాంతాల్లోని అమ్మవారి మండపాలను సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

– న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం


అమ్మవారిని దర్శించుకుంటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా


అక్షరాభ్యాసాలకు హాజరైన భక్తులు


గిర్మాజీపేటలో.. చీరల పంపిణీ

అంతర్జాతీయ పారా త్రోబాల్ జట్టులో ప్రశాంత్



వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పారా త్రోబాల్ జట్టులో వరంగల్ జిల్లా క్రీడాకారుడికి చోటు దక్కింది. పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(పీటీఎఫ్ఐ) వెల్లడించిన భారత జట్టు సభ్యుల్లో రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన గాడిపల్లి ప్రశాంత్ ఉన్నట్లు తెలంగాణ పారా త్రోబాల్ సంఘం కార్యదర్శి సింగారపు బాబు తెలిపారు. డిసెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు కాంబోడియాలో జరిగే అంతర్జాతీయ పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో ప్రశాంత్ పాల్గొంటారని వివరించారు. పుట్టకతోనే ప్రశాంత్ కుడికాలు 50శాతం పనిచేయదు. పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి స్ఫూర్తితో దేశానికి పతకం తీసుకొస్తానని ఈ సందర్భంగా ప్రశాంత్ పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలైన ఘటన బుధవారం వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ డిపోకు చెందిన పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు ఖమ్మం నుంచి వరంగల్ వస్తోంది. ఈక్రమంలో వరంగల్ నుంచి ఇల్లంద వెళుతున్న ట్రాక్టర్ కట్ర్యాల గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంకులోకి వెళ్లే క్రమంలో బస్సు ఢీ కొట్టింది. ప్రమాదంలో చోదకులతో పాటు 8మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్సై చందర్ తెలిపారు.

ఘన వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

కొత్తవాడ, న్యూస్‌టుడే: వరంగల్ 12వ డివిజన్‌లోని గౌతమినగర్‌లోని చెత్తాడబ్బాలో పేరుకుపోయిన ఘన వ్యర్థాల సమస్యను 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా శానిటరీ సూపర్‌వైజర్ పసునూరి భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా.. పారిశుద్ధ్య సిబ్బంది బుధవారం తొలగించారు.

ఖిలావరంగల్: తూర్పుకోటలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేశారు. పండగ సమీపిస్తున్నా.. ఏర్పాట్లు చేయడం లేదంటూ స్థానికులు విన్నవించగా.. 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉత్సవాలు జరిగే మైదానాన్ని డోజర్ సాయంతో శుభ్రం చేయించారు.

- ఖిలావరంగల్ మధ్యకోట శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయం ప్రాంతంలోని గుంతలను 38వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమ చదును చేయించారు.

వ్యాపార అనుమతి లేకుంటే జరిమానా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని ప్రతి వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు ఉండాలని, లేకపోతే జరిమానా విధించాలని ప్రజారోగ్య విభాగం అధికారులు, ఉద్యోగులను గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా.అశ్విని తానాజీ ఆదేశించారు. బుధవారం హంటర్‌రోడ్ ప్రాంతంలోని పెట్రోల్ పంపు, వాహనాల షోరం, ఇతర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వారందరికీ జరిమానా విధించాలని కమిషనర్ కోరారు. ట్రేడ్ లైసెన్సు రుసుముల వసూళ్లను ముమ్మరం చేయాలన్నారు. హంటర్‌రోడ్ దుర్గదేవి కాలనీ, ప్రశాంత్‌నగర్-3, లోటస్ కాలనీ, యాదవనగర్, వంగపహాడ్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, సామాజిక భవనం పనులు పరిశీలించారు. వరంగల్ ప్రాంతంలోని స్తంభంపల్లి, గాడిపెల్లి, నక్కలపెల్లి, శంభునిపేట, రంగశాయిపేటలో సీసీ రహదారులు, మురుగు కాలువలు పరిశీలించారు. ఎస్ఈ రాజయ్య, ఈఈ సంతోష్‌బాబు, డీఈలు, శ్రీకాంత్, రవికిరణ్, సీఎంహెచ్‌వో డా.రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్లు నరేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'బంజారాల ఇతిహాసం చరిత్రగా మారబోతోంది'


మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్, చిత్రంలో హుస్సేన్‌నాయక్, గరికపాటి మోహన్‌రావు, ప్రదీప్‌రావు, శ్రీధర్, ధర్మారావు

నర్సంపేట, న్యూస్‌టుడే: దేశహితం కోసం బంజారాలు చేసిన కృషిని గుర్తించిన ప్రధాని మోదీ బంజారాల సంస్కృతిని పరిరక్షించేందుకు రూ.900 కోట్లతో నగర భవనం నిర్మిస్తున్నారని మాజీ ఎంపీలు సీతారాంనాయక్, బీబీ పాటిల్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ తెలిపారు. నగర భవన్ నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం నర్సంపేటలో భాజపా ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాని చొరవ, కృషితో బంజారాల ఇతిహాసాలు చరిత్రగా మారబోతున్నట్లు పేర్కొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున నృత్యాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేస్తోందని విమర్శించారు. మూసీనది ప్రక్షాళన పేరుతో పెద్దలను వదిలి పేదలను వేధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, ఖమ్మం జిల్లా నాయకుడు వినోదరావు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రావు పద్మ, గంట రవికుమార్, ఎడ్ల అశోక్‌రెడ్డి, రాణా ప్రతాప్‌రెడ్డి, ప్రతాప్, నర్సింహరాములు పాల్గొన్నారు.

పోలీసుల అడ్డంగిత..

ప్రధాని మోదీ చిత్రపటానికి చేపట్టిన క్షీరాభిషేకం కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నట్లు భాజపా నాయకులు ఆరోపించారు. అనుమతి లేకుండా అమరవీరుల స్తూపం కూడలిలో, కాకతీయ కళాతోరణం సర్కిల్ వద్ద రోడ్డుపై వేదిక ఏర్పాటు చేయగా సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి తొలగించారు. పార్టీ నాయకులు వరంగల్ సీపీతో మాట్లాడితే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

గడువు ముగిసిన రసాయనాలతో ఐస్‌క్రీం తయారీ

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: గడువు ముగిసిన రసాయనాలతో ఐస్‌క్రీం తయారు చేస్తున్న కేంద్రంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. వరంగల్ ఏనుమాముల సమీపంలో శ్రీపాల్‌రెడ్డి గత కొద్ది రోజులుగా నాణ్యత లేని ఐస్‌క్రీంలు తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారలతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేశారు. గడువు ముగిసిన 30 రకాల రసాయనాలను, తయారుచేసిన ఐస్‌క్రీంను స్వాధీనం చేసుకున్నారు. వాటి రూ.10.5 లక్షల వరకు ఉంటుందని ఏసీపీ తెలిపారు. వాటిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పవన్, ఎస్సై శరత్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


శ్రీవల్లి

దుగ్గొండి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ పురుగు మందు తాగి చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన ఘటన గోపాలపురంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగులగాని శ్రీవల్లి(17) ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో గత నెల 9న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుమందు తాగింది. ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విధులకు ఆటంకం.. నిందితుడికి జరిమానా

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించిన మందల సదానందకు రూ.4 వేల జరిమానా విధిస్తూ. . వరంగల్ ప్రధాన మున్సిఫ్ మెజిస్ట్రేట్ కె.చండీశ్వరీదేవి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గీసుకొండ మండలం ఊకల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పరుపాటి సునీత 2017 మార్చి 17న అదే గ్రామంలో సిబ్బందితో కలిసి ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. ఈక్రమంలో మందల సదానందం ఇంటికి వెళ్లగా.. అతను లోనికి రానివ్వలేదు. పైగా అసభ్యంగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయస్థానం అతనికి పైవిధంగా జరిమానా విధించింది. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరఫున సహాయక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేశ్ ఆనంద్ వాదించగా.. కోర్టు కానిస్టేబుల్ ఎం.చంద్రయ్య పలువురు సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చారు.

రెండు లారీలు ఢీ: ఇద్దరికి గాయాలు

రాయపర్తి, న్యూస్‌టుడే: రెండు లారీలు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రం శివారులో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా నుంచి ఖమ్మం వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ, ఖమ్మం నుంచి వరంగల్ వైపు మిర్చి లోడుతో వస్తున్న లారీలు మండల కేంద్రం శివారు పెట్రోల్‌పంపు మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఓ లారీ చెట్టును ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు చోదకులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రాయపర్తి నుంచి వర్ధన్నపేట వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న రాకేశ్ వర్ధన్నపేట శివారులో జాతీయ రహదారిపై అదుపుతప్పి కింద పడ్డాడు. గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

నష్ట పరిహారం అందించాలి

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మహేశ్వరంలోని గొల్లవాడలో ఇటీవల విద్యుదాఘాతంతో పలు ఇళ్లల్లో వస్తువులు పాడయ్యాయి. సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు మహేశ్వరంలోని గ్రామీణ డిస్కం కార్యాలయంలో బుధవారం వినతిపత్రాన్ని అందించారు. రూ.50 వేల నష్టం వాటిల్లిందని, కొత్త విద్యుత్తు మీటర్లను బిగించాలన్నారు. నాయకులు కుమారస్వామి, మలహల్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్, లక్ష్మీ తదితరులున్నారు.

ఐజీసీ పరేడ్‌కు సైనిక్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

ఖానాపురం, న్యూస్‌టుడే: ఇంటర్ గ్రూప్ క్యాంపు (ఐజీసీ) సికింద్రాబాద్‌లో జరిగే పరేడ్‌కు అశోక్‌నగర్‌కు చెందిన సైనిక్‌స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజులుగా కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న ఎన్‌సీసీ పరేడ్‌లో జూనియర్ విభాగంలో 25 మంది, సీనియర్‌లో 20 మంది పాల్గొన్నారు. సీనియర్‌లో మోహన్, జూనియర్‌లో ప్రశాంత్ ఉత్తమ పరేడ్ క్యాడెట్లుగా ఎంపికైనట్లు తెలిపారు.

నర్సంపేట నియోజకవర్గం

పీఆర్టీయూ రాష్ట్ర కమిటీలో పెద్దపీట

నర్సంపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో బుధవారం జరిగిన పీఆర్‌టీయూ-టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో నర్సంపేట మండలానికి చెందిన ఉపాధ్యాయులకు అవకాశం కల్పించారు. కమిటీలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఉమామహేశ్వర్, శ్యాంప్రసాద్, వీరన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేశ్, కార్యదర్శులు ఎన్నికైనట్లు ఉమామహేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

మత్తు పదార్థాలను నిర్మూలించాలి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

నర్సంపేట, న్యూస్‌టుడే: మద్యం, మత్తు పదార్థాలను నిర్మూలించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య(ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.రాగసుధ అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో యువతను చైతన్యపరిచే ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పద్మ, హరిత, జమున, పద్మ, బిందు, మాలమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంజయ్‌బాబు

కరీమాబాద్, న్యూస్‌టుడే: వరంగల్ ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉర్సు, కరీమాబాద్ బతుకమ్మ, దసరా ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపూరి సంజయ్‌బాబు, మేడిది మధుసూదన్ కోరారు. బుధవారం కరీమాబాద్‌లోని ఆదర్శ పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 10న సద్దుల బతుకమ్మ, 12న జరిగే దసరా ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు. రావణ వధ కార్యక్రమానికి ఈ ఏడాది 70 అడుగుల ప్రతిమ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ కోశాధికారి మండ వెంకన్నగౌడ్, ట్రస్టు ఛైర్మన్ వంగరి కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంచార పశువైద్యశాల తనిఖీ

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి పరిధిలోని 1962 సంచార పశు వైద్యశాలను బుధవారం రాష్ట్ర 1962 ప్రాజెక్టు హెడ్ డా.భాగీష్‌మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, వైద్యుడు డా.ఉదయ్, పారావేటి రాజాకుమారి, కెప్టెన్ రాజు, హెల్పర్ మల్లయ్య ఉన్నారు.